విలువలతో కూడిన విద్య ప్రభుత్వ బడుల్లోనే సాధ్యం



'బడిబాట'లో పాల్గొన్న హెచ్‌ఎం అనంతరెడ్డి, ఉపాధ్యాయులు

చంపాపేట: విలువలతో కూడిన ఉచిత, నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమని చంపాపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంచిరెడ్డి అనంతరెడ్డి అన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆయన ఉపాధ్యాయులతో కలిసి చంపాపేట డివిజన్ నేతాజీనగర్, కటకోనికుంట, రెడ్డి బస్తీ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్‌ఎం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధిస్తారని చెప్పారు. ప్రతీ విద్యార్థికి రెండు జతల స్కూల్ యూనిఫారాలు, రుచికరమైన మధ్యాహ్న భోజనంతోపాటు వారంలో మూడుసార్లు గుడ్డు, ఉదయం అల్పాహారం అందిస్తారని అనంతరెడ్డి తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థల స్థాయికి మించి ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యత, క్రమశిక్షణతో కూడిన విద్యా బోధన ఉంటుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు రాంరెడ్డి, లక్ష్మీ, సుదేశ్న, అజిత, వెంకటదేవి, జ్యోతి, రజిత, కావ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పోల్‌దాస్ చంద్రమ్మ, సభ్యులు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేసిన నర్సింహారెడ్డి, మౌలానాబాబా

మన్సూరాబాద్: క్రీడలు యువత మానసిన ఉల్లాసానికి, చెడు ఆలోచనలు రాకుండా తోడ్పడతాయని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ఆధ్యాత్మికవేత్త మౌలానా బాబా మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులకు టీ షర్టులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లలను సెల్‌ఫోన్‌కు బానిస కానీయొద్దని, క్రీడలపై మక్కువ పెరిగేలా చూడాలని అన్నారు. మన్సూరాబాద్ పరిసర ప్రాంతవాసులకు పెద్దచెరువు ప్రాంగణం వాకింగ్‌తో పాటు వివిధ వ్యాయామాలు చేసుకొనేందుకు, క్రీడలు ఆడేందుకు అనుకూలంగా ఉందని, క్రీడలకు అన్ని రకాల వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ సీఐ జలేంధర్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, వేమన్‌రెడ్డి, యాదయ్య, వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

వాచ్‌మన్ల సమస్యల పరిష్కారానికి కృషి



సంతాప సభలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు చంద్రమోహన్

చైతన్యపురి: ప్రైవేట్ అపార్టుమెంట్లలో వాచ్‌మన్లుగా పని చేస్తున్న వారి సమస్యలపై సీఐటీయూ పోరాటం చేస్తుందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీర్య అధ్యక్షతన జరిగిన వాచ్‌మన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బీమా నాయక్ సంతాప సభలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. స్కూల్ బస్ డ్రైవర్‌గా పనిచేస్తూ బీమా నాయక్ వాచ్‌మన్ యూనియన్‌లో కొనసాగుతూ ఎంతో సేవ చేశారని కొనియాడారు. 39 ఏళ్ల వయసులో బ్రెయిన్ డెడ్ అయి ఆయన మరణించటం తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి సీహెచ్ వెంకన్న, బీమా నాయక్ సతీమణి క్రాంతి, కుటుంబ సభ్యులు, ప్రజానాయకులు చైతన్య, సి.మల్లేష్, చెన్నారం మల్లేష్, స్వామి, బాబన్న, అంజన్న, శంకర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

వనస్థలిపురం: రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్యనగర్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆయన పర్యవేక్షించారు. ఎత్తు పల్లాలను సరిగా చూసుకుని రోడ్డుపై నీరు నిల్వకుండా రోడ్డును నిర్మించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ ప్రజ్ఞ, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యంజాల సుధాకర్, ప్రధాన కార్యదర్శి రామావత్ రవినాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడు దశరథ్, ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, గోపీనాయక్ తదితరులు పాల్గొన్నారు.



గుంటి జంగయ్యనగర్‌లో రోడ్డు నిర్మాణంపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సామాజికవేత్తకు సన్మానం



సంగారెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ పరిరక్షణ, సమాజానికి ఉపయోగ పడే కార్యక్రమాలను వ్యాప్తిచేయడంలో ముందున్న ప్రముఖ సామాజికవేత్త, సీనియర్ జర్నలిస్టు బండ సంగారెడ్డిని శుక్రవారం రంగారెడ్డి జిల్లా హస్తినాపురం అగ్రికల్చర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్,శ్రీరామాంజనేయ భజనమండలి,అగ్రికల్చర్ కాలనీ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరు సంగారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యుడు, స్వామి వివేకానంద స్ఫూర్తి పురస్కార గ్రహీత డాక్టర్ టి.సురేందర్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గొని చంద్రమోహన్ రెడ్డి, సెక్రటరీ బేతనమూడి సుబ్బారావు, ట్రెజరర్ ఏకుల జితేందర్ రెడ్డి, శ్రీ రామాంజనేయ భజన మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు, యోగాగురువు విజయ ప్రతాప్ మహారాజ్ గురూజీ, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీలో పర్యావరణ పరిరక్షణ, జల సంరక్షణ కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని చెప్పారు.

వర్షాకాలానికి ప్రణాళిక సిద్ధం

పహాడీషరీఫ్: వర్షాకాలం, బక్రీద్ పండుగ సందర్భంగా వ్యర్థాల సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికను రూపొందించామని జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది అన్నారు. మాన్సూన్ ఎమర్జెన్సీ, పండుగల నేపథ్యంలో జల్‌పల్లి మున్సిపాలిటీ పాలక మండలి శుక్రవారం చైర్మన్ అధ్యక్షతన సమావేశమైంది. కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి పర్యవేక్షణలో భూగర్భ డ్రైనేజీ క్లినింగ్ కోసం మిషన్ల ఎంగేజ్, పారిశుద్ధ్య నిర్వహణకు జేసీబీలు, డోజర్, ట్రాక్టర్లు, కార్మికులను తీసుకునేందుకు రూ.35లక్షల నిధులు ఖర్చు పెట్టేందుకు పాలక మండలి ఆమోదం తెలిపింది. దీంతో పాటు 28 వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ సామగ్రి,ఫాగింగ్ మిషన్లు, ఆయిల్ బాల్స్, సిబ్బందికి రక్షణ వస్తువులు లాంటి వాటి కోసం రూ.19 లక్షలు కేటాయించనున్నారు. బక్రీద్ పురస్కరించుకొని ఖుర్బానీ వ్యర్థాలు వేయడానికి ప్లాస్టిక్ పెద్ద కవర్ల కొనుగోలు, వ్యర్థాలను తొలగించడానికి జేసీబీ, ట్రాక్టర్లు, కార్మికుల కోసం రూ.10 లక్షలు ఖర్చు చేయనున్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా ప్రజలు మున్సిపాలిటీ తరపున అందజేసిన కవర్లలో వ్యర్థాలను వేయాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా అత్యవసర సమయంలో స్పందించేందుకు అన్ని రకాలుగా సిబ్బందిని సిద్ధం చేశామన్నారు.



పాలక మండలి సమావేశంలో చైర్మన్ అబ్దుల్లా సాది

ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కౌన్సిలర్లు కెంచె లక్ష్మీనారాయణ, దిల్రూసా హసన్ షా, జాఫర్ బామ్, మజ్హర్ అలీ, శంషూద్దీన్, ఖాలేద్ మహరూస్, షేక్ ఫమిదా అఫ్జల్, ఆర్‌ఓ సుదర్శన్, మేనేజర్ నిర్మల, డీఈ వెంకన్న, టీపీఓ హబీబున్నీసా, ఏఈ ఇష్రత్ ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులకు రూ. 54 లక్షలు మంజూరు

- బక్రీద్ నిర్వహణకు రూ.10 లక్షలు
- ఆమోదం తెలిపిన జల్‌పల్లి పాలక మండలి

ఎర్రకుంటలో రోడ్డు మరమ్మతులకు..

శ్రీశైలం ప్రధాన రహదారిలోని ఎర్రకుంటలో గోతులమయమైన రోడ్డు మరమ్మతుల కోసం రూ.6 లక్షలు కేటాయించారు. ఈ రహదారికి ఇరువైపులా మురుగునీరు వెళ్లకుండా మున్సిపాలిటీ తరఫున మోరీల నిర్మాణం చేసినప్పటికీ రోడ్డు మరమ్మతులు చేసేందుకు ఆర్ అండ్ బీ అధికారులు ముందుకు రావడం లేదని చైర్మన్ తెలిపారు. వాహనదారులకు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తాము ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

కస్తమర్ల ఆరోగ్యంపై వేటు!

బిల్లులు ఫుల్.. నాణ్యత నిల్ !

- పేరుకే పెద్ద హోటళ్లు
- కిచెన్లలో అపరిశుభ్రత తాండవం
- ఫ్రిడ్జ్‌ల్లో రోజుల తరబడి చికెన్, మాంసం నిల్వ
- కస్టమర్లకు రసాయనాలు చల్లిన ఆహార పదార్థాల సరఫరా
- ఎల్‌బీనగర్ సర్కిల్–3 శానిటేషన్ అధికారుల తనిఖీల్లో గుర్తింపు
- అమరావతి, లక్కీ రెస్టారెంట్లకు రూ.25 వేల చొప్పున జరిమానా



అమరావతి రెస్టారెంట్‌లో నిల్వ ఉంచిన పదార్థాలను పరిశీలిస్తున్న శానిటేషన్ అధికారి లావణ్య

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్‌లోని పలు రెస్టారెంట్ల పరిస్థితి పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది. కస్టమర్ల నుంచి పెద్ద మొత్తంలో బిల్లులు దండుకుంటున్న ఈ హోటళ్లలో నాణ్యమైన ఆహార పదార్థాలను అందిస్తారని అనుకొని మీరు వెళ్లారా... అనారోగ్యాన్ని ఆహ్వానించినట్టే. చాలా హోటళ్లలోని కిచెన్లలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఒకే గదిలో కూరగాయలను తరగడం, కుళ్లిన కూరగాయలను, చెత్తాచెదారాన్ని అక్కడే నిల్వ చేయడం, వంట కూడా అక్కడే చేస్తుండం, కిచెన్ పక్క నుంచే మురుగునీరు పారుతుండటం వంటి దృశ్యాలు దర్శనమిస్తున్నాయి.

- నాగోలులోని అమరావతి,లక్కీ హోటళ్లలోని పరిస్థితే ఇందుకు ఉదాహరణ. ఇక్కడ అందించే ఆహారం రేటు చాలా ఎక్కువ కానీ.. నాణ్యత మాత్రం చాలా తక్కువగా ఉంటుంది. ఈ రెండు హోటళ్లలో శుక్రవారం తనిఖీలు చేసిన ఎల్‌బీనగర్ సర్కిల్–3 శానిటేషన్ అధికారులు కిచెన్లలోని పరిస్థితిని చూసి విస్తుపోయారు. నిర్వహణ లేక అధ్వానంగా ఉందని తెలుసుకున్నారు. ఫ్రిడ్జ్‌ల్లో రోజుల తరబడి చికెన్, మటన్ నిల్వ ఉంచుతున్నారని, కుళ్లిన స్థితికి చేరిన ఆ మాంసంతో ఆహారం వండి వినియోగదారులకు వడ్డిస్తున్నారని గుర్తించారు. అలాగే, నిల్వ చేసిన ఆహార పదార్థాలపై రసాయనాలు చల్లుతున్నారనే అనుమానం కూడా అధికారులు వ్యక్తం చేశారు. కాగా, నిల్వ చేసిన ఆహార పదార్థాలను వినియోగదారులకు సరఫరా చేస్తున్నందుకు, హోటళ్లలో పరిశుభ్రత పాటించనందుకు అమరావతి, లక్కీ రెస్టారెంట్లకు రూ.25 వేల రూపాయల చొప్పున జరిమానా విధించినట్టు ఎల్‌బీనగర్ సర్కిల్–3 శానిటేషన్ అధికారి లావణ్య తెలిపారు.

రాజరాజేశ్వర ఆలయంలో పూజలు



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అత్యంత ఇష్టమైన రోజు అవ్వడంతో ప్రత్యేకంగా అలకంరించారు. అభిషేకాలు చేశారు. పలువురు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లెకుమార్, డైరెక్టర్లు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్‌-1కు ప్రత్యేక బస్సులు

ఇబ్రహీంపట్నం: ఆదివారం జరిగే గ్రూప్–1 పరీక్షలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ నర్సప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలల్లో సుమారు 30 మందికి పైగా గ్రూప్–1 పరీక్షలు రాసే అభ్యర్థులుంటే తమకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. వారి గ్రామాల నుంచి ప్రత్యేక బస్సులను ఎగ్జామ్స్ సెంటర్ల వరకు నడిపిస్తామని వెల్లడించారు. దీనికి ప్రత్యేక చార్జీలుంటాయన్నారు. పూర్తి సమాచారం కోసం 99592 26141 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మామిడిపల్లిలో 'బడిబాట'



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బడంగ్‌పేట్: బాలాపూర్ మండల పరిధిలోని మామిడిపల్లి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీఎస్ హెచ్‌ఎం, హైస్కూల్ హెచ్‌ఎం ఆధ్వర్యంలో బడిబయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన బోధన అందుతుందని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు కృష్ణాజీ, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపునకు చర్యలు తీసుకోండి



నందనవనం కాలనీలో ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్త

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో చెత్తా చెదారం పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హస్తినాపురం డివిజన్‌లోని నందనవనం కాలనీ, ఇంద్రసేనారెడ్డి నగర్, ఆదర్శ్ నగర్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా నిరుపేదలు నివాసం ఉంటారు. తమ కాలనీల్లో పారిశుద్ధ్య పనులను సక్రమంగా చేపట్టకపోవడంతో ఇళ్ల మధ్యనే చెత్త పేరుకుపోతున్నదని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎల్‌బీనగర్ సర్కిల్ ఉన్నతాధికారులు స్పందించి తమ కాలనీల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని నందనవనం, ఇంద్రసేనారెడ్డి నగర్, ఆదర్శ్ నగర్ కాలనీవాసులు కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాల్గొన్న పూర్వవిద్యార్థులతో నాటి ఉపాధ్యాయులు

చంపాపేట: చంపాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమేశనాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల 2009–2010 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 60 మంది సమావేశమయ్యారు. పాఠశాల నుంచి విడిపోయిన 15 ఏళ్ల తర్వాత సమ్మేళనం పేరిట కలుసుకున్న పూర్వవిద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. చదువుకున్న రోజుల నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్తయ్య, విజయ, మురళి, రాధాకృష్ణ, వెంకన్న, అక్బర్, శ్రీనివాస్‌రెడ్డి, స్వర్ణలత, పూర్వ విద్యార్థులు రాము, లక్ష్మణ్, హరిత, ఖాసిం, జ్యోతి, అనిల్, రమేష్, వినోద్, శేఖర్, కళ్యాణి, డేవిడ్, మునీర్, అంజి పాల్గొన్నారు.

'ఇంటికి వంద-బడికి చందా'

- ఆదర్శంగా నిలుస్తున్న మజీద్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్
- గ్రామస్తులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అభివృద్ధి
- ప్రధానోపాధ్యాయుడి ప్రత్యేక కృషి





మజీద్‌పూర్‌లో ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతులు, శిథిలావస్థ భవనాలు, అపరిశుభ్ర వాతావరణం ఉంటుందని ఒకప్పటి మాట.. ప్రస్తుతం ఓ ప్రభుత్వ పాఠశాలను చూస్తే మాత్రం అలాంటి భావన ఎవరికీ రాదు. 'ఇంటికి వంద-బడికి చందా' అనే నినాదంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీసుకున్న నిర్ణయం.. గ్రామస్తులను ఏకం చేసి పాఠశాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టిని సైతం ఆకర్షించింది. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఆ పాఠశాలనే అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని మజీద్‌పూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల. ఒకప్పుడు రంగులు వెలసిన పాత గోడలతో దర్శనమిచ్చే పాఠశాల గోడలను.. ప్రస్తుతం దేశంలోని ప్రముఖుల చిత్రాలతో పెయింటింగ్ చేయించారు. పాఠశాల ముఖద్వారం మొదలుకుని ఆవరణలోని స్టేజీ, ఆ పక్కనే గౌతమ బుద్ధుడు, సరస్వతీ విగ్రహాలను ఏర్పాటు చేయించారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలను గ్రామస్తులు స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చి సమకూర్చడంతో పాటు ప్రభుత్వ పాఠశాలంటే అందరికీ మక్కువ ఉండే రీతిలో తీర్చిదిద్దారు.

అందరి భాగస్వామ్యంతో పాఠశాల అభివృద్ధి

గ్రామస్తులందరి తోడ్పాటుతోనే పాఠశాల అభివృద్ధి సాధ్యమైంది. రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు,విద్యాకమిటీ సభ్యులందరూ ఒక్కతాటిపైకి వచ్చి గ్రామంలోని పాఠశాలను అభివృద్ధి చేశారు. పదో తరగతి ఫలితాల్లో ఇక్కడి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. తాజాగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి సహకారంతో పాఠశాల గోడలకు రంగులు వేయించాం. తోడ్పాటునందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

–విజయభాస్కర్‌రెడ్డి, హెచ్‌ఎం మజీద్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్

కాలనీల్లో డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం డివిజన్‌లోని వివిధ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ , తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్‌కే పురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్ రెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులను కోరారు. వెంటనే స్పందించిన అధికారులు సానుకూలంగా స్పందించి త్వరగా పనులు పూర్తి చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కాలనీ వాసులు తదితరులు

అభివృద్ధిలో రాజీ పడే ప్రసక్తి లేదు

మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో రాజీపడే ప్రసక్తి లేదని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. వాటర్ వర్క్స్, విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి శుక్రవారం అక్బర్‌బాగ్ పరిధిలోని పల్టాన్, సపోటబాగ్ ప్రాంతాలలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. డివిజన్‌లోని హైదరాబాద్ కిడ్నీ ఆస్పత్రి సమీపంలో వాటర్ వర్క్స్ శాఖ ఏర్పాటు చేసిన 150 ఎంఎం డీఐపీ డిస్ట్రిబ్యూషన్ లైన్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడానికి కృషి చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, వాటర్ వర్క్స్ మలక్‌పేట డీజీఎం షీలారాణి, అస్మాన్‌ఘడ్ ఏరియా మేనేజర్ అల్తాఫ్, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

చామల కిరణ్‌కుమార్‌కు శుభాకాంక్షలు



ఎంపీగా గెలిచిన కిరణ్ కుమార్‌ను గజమాలతో సన్మానిస్తున్న జంగారెడ్డి

చంపాపేట: లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి ఎంపీగా భారీ మెజార్టీతో గెలుపొందిన చామల కిరణ్ కుమార్‌ను శుక్రవారం కర్మన్‌ఘాట్ శ్రీ ధ్యానాంజనేయ స్వామి ఆలయ పాలక మండలి మాజీ డైరెక్టర్ బసిగూడెం జంగారెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గజమాల, శాలువలతో ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సోమనాథరెడ్డి, గోపాల్ ముదిరాజ్, యాదగిరి, జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 35, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 60, కాకర 38, బీర 40, క్యాబేజీ 21, ఫ్రెంచిబీన్స్ 105, క్యారెట్ 37, దొండ 15–18, చిక్కుడు 65, గోకర 40, బీట్‌రూట్ 21, క్యాప్సికం 60, ఆలు 34, దోస 28, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 29, చామగడ్డ 40. శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితుడిని చూపిస్తున్న సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు

దిల్‌సుఖ్‌నగర్: గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం... సరూర్‌నగర్ ఎక్సైజ్ శాఖ పోలీసులు శుక్రవారం ఎల్‌బీనగర్ పరిసరాల్లో శుక్రవారం సోదాలు చేపట్టారు. ఇదే సమయంలో భద్రాచలంలో గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్న ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తిని పట్టుకున్నారు. పోలీసుల విచారణలో అతను బాలాపూర్ ప్రాంతంలో గంజాయిని విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి 1.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, అతడిని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. సోదాల్లో ఎస్‌ఐలు ఫయజ్, కృష్ణయ్యగౌడ్, రవి, వెంకట్, నర్సింహారావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మహేశ్వరం: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను ఆయన పరిశీలించారు. కార్యాలయాలకు వచ్చే రైతులు, బాధితులతో ఆయన మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని ఆయన అన్నారు. ఎన్నికల కోడ్‌తో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కొంత బ్రేక్ పడిందని, కోడ్ ఎత్తివేయడంతో ఇక నుంచి ప్రభుత్వం ప్రజా పాలన, సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారిస్తుందని లక్ష్మారెడ్డి తెలిపారు. అంతకు ముందు తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ శైలజల, ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్‌లతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, వత్తుల రఘుపతి, ఆవుల యాదయ్య, అంధ్యా నాయక్, లాజర్, అల్లె కుమార్, మురళిధర్‌రెడ్డి, నర్సింహాగౌడ్ పలువురు పాల్గొన్నారు.

